# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఛండీగడ్‌లో పర్యటిస్తారు.**
2. **ఫెయింజల్ తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
3. **తెలంగాణలో త్వరలోనే గ్రూప్-1 ఉద్యోగాల నియామకపత్రాలు అందజేస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.**
4. **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 11 వేల 467 కోట్ల రూపాయల పనులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది.**
5. **భారత ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ జయంతి ఈరోజు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ఛండీగడ్ లో పర్యటిస్తారు. ఈ పర్యటనలో భాగంగా దేశ న్యాయ వ్యవస్థలో అమలవుతున్న నూతన మూడు నేర చట్టాల పురోగతిని సమీక్షిస్తారు. ఈ సందర్భంగా, కొత్త చట్టాలను ప్రవేశపెట్టిన తర్వాత చట్టం అమలు, న్యాయ విధానాలు, సాక్ష్యాధారాల నిర్వహణపై చేపట్టే ప్రదర్శనను వీక్షిస్తారు. దేశవ్యాప్తంగా కొత్త నేర చట్టాలు జూలై 1, 2024న అమల్లోకి వచ్చాయి. ప్రతి ఒక్కరికీ సమర్థవంతమైన న్యాయ వ్యవస్థను అందుబాటులో తీసుకువచ్చే లక్ష్యంతో ఈ చట్టాలను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఫెయింజల్ తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తుపాను సహాయక చర్యలపై గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో అధికారులతో నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.. వర్షం కారణంగా తడిచిన ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చెయ్యాలని, వర్షాల ప్రభావం పూర్తిగా తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్య మంత్రి సూచించారు. తిరుపతి , చిత్తూరు, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య జిల్లాలోని 53 మండలాల్లో తుఫాను ప్రభావం ఉందని తెలిపారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 6,824 హెక్టార్ల మేర వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

--------------------------

తెలంగాణలో త్వరలోనే గ్రూప్–1 ఉద్యోగాల నియామకపత్రాలు అందజేస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఆరోగ్య ఉత్సవాలను ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఎన్టీఆర్ మార్గ్‌లో 108, 102 వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో 28 పారామెడికల్, 16 నర్సింగ్ కళాశాలను ముఖ్యమంత్రి దృశ్య మాధ్యమం విధానంలో ప్రారంభించి మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య శాఖకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. ఇందులో భాగంగానే వైద్య ఆరోగ్యశాఖలో ఒక ఏడాదిలోనే 14వేల నియామకాలు చేపట్టామని ముఖ్యమంత్రి తెలుపుతూ

…వాయిస్ సెకన్లు..33 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ప్రజలకు మరింత ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. సచివాలయాలశాఖపై మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామితో కలిసి గుంటూరుజిల్లా ఉండవల్లిలో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో సచివాలయాలు ప్రజలకు మరింత చేరువయ్యేలా మెరుగైన సేవలు అందించాలని అధికార్లను ఆదేశించారు. మానవ వనరులు సక్రమంగా వినియోగించుకోవడం, ఉద్యోగుల అవసరాలు, సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా అందరికీ సమానమైన పని బాధ్యత ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 11 వేల 467 కోట్ల రూపాయల పనులకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ –సీఆర్డీఏ ఆమోదం తెలిపిందని పురపాలక శాఖ మంత్రి పి నారాయణ వెల్లడించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సీఆర్డీఏ సమావేశం నిన్న జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 23 అంశాలకు అథారిటీ ఆమోదం తెలిపింది. సమావేశం అనంతరం మంత్రి నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ (27 సెకన్లు)

---------------------------

భిన్నత్వంలో ఏకత్వం భారత సంస్కృతిలో భాగమని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. 'ఏక్ భారత్–శ్రేష్ఠ్ భారత్'లో భాగంగా విజయవాడలోని రాజ్‌భవన్‌లోనాగాలాండ్, అస్సాం ఆవిర్భావ వేడుకలను నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, నాగాలాండ్ సంస్కృతి, ఆచార వ్యవహారాలు తెలుపుతూ నిర్వహించే హార్న్ బిల్ పండగ అక్కడ ప్రత్యేకం అని పేర్కొన్నారు. అస్సామీ సంస్కృతిలో బిహు పండగకు ముఖ్య స్థానముందని తెలిపారు.

---------------------------

తెలంగాణలో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సాగు అయ్యిందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడలో పలు అభివృద్ధి పనులకు మంత్రి నిన్న శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన చర్యలతో తెలంగాణ దేశంలోని అత్యధికంగా వరిని ఉత్పత్తి చేసిందని చెప్పారు. కోదాడలో 400 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను చేపట్టామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రానున్న రోజుల్లో తెలంగాణని ఆయిల్ పామ్ పంట కేంద్రంగా మారుస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని అన్నారు. ఏడాదికి లక్ష ఎకరాల్లో పంట సాగు చేపట్టేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని చెప్పారు. ఈ పంట సాగుకు నాలుగేళ్లలో ఎకరాకు 50 వేల ప్రోత్సాహకం అందిస్తున్నామని మంత్రి వివరించారు.

---------------------------

భారత ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ జయంతి ఈరోజు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను ప్రజలు స్మరించుకుంటున్నారు. భారతస్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిన ఆయన... 1884 డిసెంబరు 3వ తేదీన బీహార్ రాష్ట్రంలోని జెర్దాయ్ గ్రామంలో జన్మించారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో కూడా కీలక భూమిక పోషించారు. దేశానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం "భారతరత్న" పురస్కారంతో సత్కరించింది. 1963 ఫిబ్రవరి 28వ తేదీన ఆయన కన్నుమూశారు.. గతంలో ఒక సందర్భంలో ఆ మహనీయుడు చేసిన ప్రసంగాన్ని ఒకసారి గుర్తు చేసుకుందాం...

వాయిస్ - 17 సెకన్లు

---------------------------

మాదకద్రవ్యాల నివారణకు ఉభయ తెలుగు రాష్ట్రాలు సంయుక్త కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన అంశాలపై చర్చించేందుకు గుంటూరు జిల్లా మంగళగిరిలో తెలుగు రాష్ట్రాల సీఎస్‌ల కమిటీ నిన్న సమావేశమైంది. ఈ సమావేశంలో 861 కోట్ల మేర కార్మిక సెస్‌ను ఆంధ్రప్రదేశ్ – తెలంగాణల మధ్య పంపకానికి అంగీకారం కుదిరిందని అధికారులు తెలిపారు. మత్తు పదార్థాల నివారణకు ఇరు రాష్ట్రాల పోలీస్, ఎక్సైజ్ శాఖలతో సంయుక్త కమిటీ వేయాలని నిర్ణయించారని, విభజన అంశాలపై చర్చించేందుకు మరోసారి సమావేశం కానున్నారని అధికారులు తెలిపారు.

---------------------------

విదేశాల్లో ఉన్న వలస కార్మికులకు అండగా ఉంటామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట, వజ్రపుకొత్తూరు, నందిగాం చెందిన వలస కార్మికుల విషయాన్ని సౌదీ అరేబియాలో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఇచ్ఛాపురం శాసనసభ్యులు బెందాళం అశోక్ కేంద్రమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన బాధిత కార్మికులతో మాట్లాడారు. అందరినీ సురక్షితంగా స్వదేశానికి తీసుకు వచ్చేలా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌తో చర్చించి చర్యలు చేపడతామన్నారు.

---------------------------

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలంగాణలోని హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. శీతాకాల విడిదిలో భాగంగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేయనున్నారు. ఈ మేరకు ఆమె పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఈనెల 16 నుంచి 21 వరకు ఆరు రోజుల పాటు.. హైదరాబాద్‌లో విడిది చేయనున్నారని అధికారులు తెలిపారు.

=====================